

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని ప్రారంభించిన ఎంపీ

వనస్థలిపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాగోల్ డివిజన్ సాయినగర్‌లో కాలనీవాసులు సొంత నిధులతో నిర్మించుకున్న కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని ఎంపీ ఈటల ఆదివారం స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాలనీవాసులు ఐక్యమత్యంతో ఉంటూ తమ సొంత నిధులతో కాలనీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించుకోవడం అభినందనీయం అన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, పవన్‌కుమార్, సాయినగర్‌కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి, యుగేంధర్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్పొరేటర్ సుజాతానాయక్‌కు సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

సంతోష్‌నగర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ తెలిపారు. ఆదివారం కాలనీవాసులు కార్పొరేటర్‌ను కలిసి పలు సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు విజయభాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ విద్యావతి విజయేందర్‌రెడ్డి

నిత్యావసర సరుకుల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : పెద్దఅంబర్‌పేట్‌లో చిల్డ్రన్ ఆఫ్ డెక్కన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం లెప్రసీ బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ వడ్డెపల్లి విద్యావతి విజయేందర్‌రెడ్డి వంద కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ పేదలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి ప్రతి ఒక్కరూ సేవా భావంతో ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో స్లాప్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, చిల్డ్రన్ ఆఫ్ డెక్కన్ ఫౌండేషన్ ఫౌండర్ నాగళ్ల మల్లన్న, జినన్స్ హేజిల్ పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా సత్యనారాయణ

సంతోష్‌నగర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా కోల సత్యనారాయణ ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన చంద్రాయణగుట్ట అదనపు ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ నగర కమిషనర్ ఆదేశాల మేరకు బదిలీపై సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

భాషా పరిరక్షణ కోసం సాహిత్య అంశాల్లో పోటీలు

కొత్తపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భాషా పరిరక్షణ కోసం సాహిత్య అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారని కొమర్రాజు ఫౌండేషన్ అధ్యక్షుడు కేవీ. జ్ఞానకుమార్, ఉపాధ్యక్షులు డా.శ్యామల అన్నారు. కొత్తపేట డివిజన్ న్యూ నాగోల్‌లో ఆదివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో భాగవత పద్య పఠన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రహ్లాద చరిత్రలోని.. ఎల్ల శరీర దారులకు.. పద్యం పాడి అందరిని ఆకట్టుకున్న చావలి గాయత్రి ప్రథమ బహుమతి సాధించగా, ఇందుగలడందు లేడని.. పద్యం పాడి భోనగిరి కనిష్క ద్వితీయ బహుమతి, మందార మకరంద.. పద్యం పాడి చావలి కార్తికేయ తృతీయ బహుమతి పొందారు. వీరికి డా.శ్యామల బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు.



ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ శ్వేతారెడ్డి

చింతల్‌బస్తీలో ఘనంగా తీజ్ వేడుకలు

సైదాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గిరిజన సంప్రదాయానికి తీజ్ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని చింతల్‌బస్తీలో ఆదివారం నిర్వహించిన ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగలు ఐక్యమత్యానికి నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు, బస్తీవాసులు రఘుపతినాయక్, కృష్ణ, సోమ్లానాయక్, దేవ్‌సింగ్, లచ్చురాం, బాలునాయక్, దేవిలాల్, శేఖర్, మహేష్, నాగరాజు వినోద్, రవి పాల్గొన్నారు.



అనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సైదాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఒకే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. సైదాబాద్ మాధవనగర్ సరస్వతీ శిశుమందిర్‌లో 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్కూల్‌లో కలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, వారి జీవన స్థితిగతులు పంచుకుని రోజంతా ఆనందంగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థి హనుమాన్ సినిమా డైరెక్టర్ ప్రశాంతవర్మ, వంశీకృష్ణ, శ్రావణి, ప్రత్యూష, హరికృష్ణ, దినేష్ పాల్గొన్నారు.



లింగోజిగూడలో బోనాల వేడుకల్లో జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు



ఇంజాపూర్‌లో బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్థులు



ఘనంగా బోనాల వేడుకలు

హయత్‌నగర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్, కమ్మగూడ, తుర్కయంజాల్‌లో బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పెద్దఎత్తున మహిళలు బోనాలు తీసుకువచ్చి ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతలకు సమర్పించారు. తుర్కయంజాల్‌లో కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మశివకుమార్, కమ్మగూడ కౌన్సిలర్లు కొశిక ఐలయ్య, కవిత శేఖర్‌గౌడ్, సునీల్, ఇంజాపూర్‌లోని 13,14వార్డుల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో స్థానిక కౌన్సిలర్లు బొక్క శ్రీలతాగౌతంరెడ్డి, రవీందర్‌రెడ్డి, నాయకులు మురళీధర్‌రెడ్డి, పల్సం బుచ్చయ్య, కృష్ణాచారి పాల్గొన్నారు.



మోహన్‌నగర్‌లో చిత్తారమ్మ అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



సత్యానగర్‌లో మైసమ్మ అమ్మవారి బోనాల వేడుకల్లో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డి

లింగోజిగూడలో..

ఎల్బీనగర్: శ్రావణ మాసం తొలి ఆదివారం సరూర్‌నగర్, లింగోజిగూడ, ఆర్‌కేపురం ప్రాంతాల్లో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజలు ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. లింగోజిగూడ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో నిర్వహించిన బోనాల వేడుకల్లో జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. లింగోజిగూడ జ్యోతిక్లబ్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరూర్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్, బీజేవైఎం నాయకుడు సాతెల్లి సాయి పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆర్‌కేపురంలో జరిగిన వేడుకల్లో పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్, బండి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: కొత్తపేట డివిజన్ కాలనీల్లో అమ్మవార్ల ఆలయాల్లో బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కొత్తపేటలోని పురాతన ప్రసన్న మహాకాళీ ఆలయం, సత్యానగర్ మైసమ్మ ఆలయం, మోహన్‌నగర్ చిత్తారమ్మ ఆలయాల్లో అమ్మవార్లని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. కాంగ్రెస్ నాయకులు ప్రకాష్‌గౌడ్, వెంకట్రామ్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్యామ్‌చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కార్పొరేటర్ పవన్‌కుమార్ సత్యానగర్, కొత్తపేట, మారుతీనగర్, మోహన్‌నగర్, ఎస్‌బీహెచ్‌కాలనీ, ఎస్‌ఆర్‌ఎల్‌కాలనీ, శృంగేరికాలనీ, సీటీఓకాలనీల బోనాల వేడుకల్లో పాల్గొని, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

కర్మన్‌ఘాట్‌లో..

సంతోష్‌నగర్: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని పోచమ్మతల్లి ఆలయంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఛైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ఛైర్మన్ నల్ల రఘుమారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సామ రంగారెడ్డి, మల్లేష్‌గౌడ్, చీర తిరుమలేష్, నిఖిల్, జగదీష్, శ్రీనివాస్, గౌతంరెడ్డి పాల్గొన్నారు.

హస్తినాపురం డివిజన్ పరిధిలో..

హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేష్‌గుప్తానగర్ కాలనీలోని పోచమ్మ ఆలయంలో బోనాల వేడుకల్లో కార్పొరేటర్ సుజాతానాయక్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ నారగోని శ్రీనివాస్‌యాదవ్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

14,15 తేదీల్లో హర్ ఘర్ తిరంగా రెపరెపలాడించాలి

- తిరంగా ర్యాలీలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి పిలుపు

చాదర్‌ఘాట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బీజేపీ జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం మలక్‌పేటలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మలక్‌పేట బీజేవైఎం ఆధ్వర్యంలో గడ్డిఅన్నారంలోని చింతచెట్టు నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ర్యాలీ దిల్‌సుఖ్‌నగర్, మూసారాంబాగ్, మలక్‌పేట నల్గొండ చౌరస్తా, చంచల్‌గూడ, సైదాబాద్, సరూర్‌నగర్ చెరువు కట్ట చౌరస్తా మీదుగా తిరిగి చింత చెట్టును చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభమైన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈనెల 14, 15వ తేదీల్లో ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడేలా ప్రతి ఒక్క బీజేపీ, బీజేవైఎం, అన్ని మోర్చాలకు చెందిన కార్యకర్తలు సమష్టిగా నిర్వహించే కార్యక్రమాలతో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం పాఠశాల విద్యార్థులతో సామూహిక తిరంగాయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. 13వ తేదీ మంగళవారం ఐఎస్ సదన్ చౌరస్తాలోని మందిర్, మజీద్ వద్ద సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 14వ తేదీన దేశ విభజన సమయంలో అనేక మంది హిందువులు ఊచకోతకు గురైన సందర్భాన్ని స్మరించుకుంటూ బ్లాక్ డే పాటిస్తూ నివాళులర్పిస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి బూత్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేలా బూత్ కమిటీ అధ్యక్షులు బాధ్యతగా నిర్వహించేలా సూచనలిచ్చినట్లు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు.



తిరంగా ర్యాలీలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

సైదాబాద్ : ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మలక్‌పేట నియోజకవర్గం బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని గడ్డిఅన్నారం రెడ్‌క్రాస్ వద్ద బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ర్యాలీ మలక్‌పేట, మూసారాంబాగ్, చంచల్‌గూడ, సైదాబాద్‌ల మీదుగా కొనసాగింది. వందలాది మంది బీజేవైఎం నేతలు జాతీయ జెండాను పట్టుకుని బైక్ ర్యాలీకి హాజరయ్యారు. ప్రతి ఇంట్లో జాతీయ జెండా రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, ఆశీష్, దినేష్, వినోద్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దండెం రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం పెద్దఅంబర్‌పేట్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎల్. కృష్ణారెడ్డి, ఎంఏ సత్తార్, పాషా, కోటేశ్వరచారి, జావీద్, రమేష్‌బాబు రాజశేఖర్‌రెడ్డిని శాలువతో సన్మానించి కేక్ కట్ చేయించారు. - అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి



తెలంగాణ బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

తెలంగాణ బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం వనస్థలిపురం గాయిత్రిభవన్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన గౌరవ అధ్యక్షుడిగా చింతపల్లి మంగపతిరావు, అధ్యక్షుడిగా పోచంపల్లి శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా నందిరాజు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా బీఎస్ ప్రసాద్, పెళ్లూరి సత్యనారాయణ, పీవీఎల్ నారాయణరావు, సహాయ కార్యదర్శులుగా సీహెచ్‌వీఆర్‌కే మూర్తి, పీ. శ్రీధర్, జీఏవీ ప్రసాద్, సీతారామశర్మ, కోశాధికారిగా మార్తి వాసుదేవరావు, సంఘటన కార్యదర్శులుగా పోగుల రాంబాబు, ఎన్‌వీ రమణారావు, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన కమిటీ సభ్యులకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ముగిసిన ఉచిత వైద్య శిబిరం

ఎల్బీనగర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఇన్‌కంటాక్స్ కాలనీలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ఆదివారం ముగిసింది. ఈ వైద్యశిబిరంలో బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది ప్రజలకు పలు రకాల పరీక్షలు చేసి వైద్యసలహాలు అందజేశారు. కేర్ ఆస్పత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మల్‌రెడ్డి హనుమంతరెడ్డి హృద్రోగ సమస్యలపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కేర్ ఆస్పత్రి మేనేజర్ నాగరాజు గౌడ్, ఇన్‌కంటాక్స్ కాలనీ సొసైటీ ప్రతినిధులు రమేష్‌బాబు, రాజశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, విజయలక్ష్మి, మునిపల్లె శ్రీనివాస్, భగత్ పాల్గొన్నారు.

మాలల్లారా బస్తీబాట పట్టండి

- ఎస్సీ వర్గీకరణతో మాలలకు జరిగే అన్యాయంపై చైతన్యం చేయాలి




అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మాల సంఘం ప్రతినిధులు

చాదర్‌ఘాట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పుతో మాలలకు జరగనున్న అన్యాయాన్ని ప్రజలకు తెలియజేసి చైతన్యం చేసేందుకు బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని మలక్‌పేట మాల సంఘం అధ్యక్షుడు ముప్పిడి బల్వంత్ పిలుపునిచ్చారు. ఆదివారం మూసారాంబాగ్‌లోని బాలమ్మ దానమ్మ బస్తీలో మలక్‌పేట మాల సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం మతతత్వ పార్టీలను అడ్డుపెట్టుకుని మొసలి కన్నీరు కార్చారని విమర్శించారు. ఏ ఒక్క రోజు కూడా మాలలపై జరిగిన దాడులు, అన్యాయాలపై ఉద్యమించలేదని ఆయన గుర్తుచేశారు. బస్తీబాట కార్యక్రమాల ద్వారా మాలలకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తూ ఎట్టి పరిస్థితుల్లోను ఎస్సీ వర్గీకరణ అడ్డుకునేలా తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చర్చించి చట్టం తీసుకువచ్చిన తర్వాతే అమలు చేయాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన ఓట్ల రాజకీయం కోసం సుప్రీంకోర్టు ద్వారా తీర్పు వెలువరించి మాలలకు అన్యాయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే సుప్రీంకోర్టు తీర్పును నిలిపివేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, లేకపోతే మాలల ఉద్యమంతో రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా అడ్డుకుంటామని వెల్లడించారు.

ఎల్పీజీతో ఇస్త్రీ చేద్దామా?

సమయం, ఖర్చు ఆదా చేయనున్న సరికొత్త ఐరన్ బాక్స్



- బొగ్గుతో శ్రమపడే కార్మికులకు ఊరట
- ఆదాయం పెరుగుదలకు దోహదం
- ఇతర రాష్ట్రాల్లో పెరిగిన వాడకం
- నగరవాసులకు పరిచయం చేసేందుకు రోటరీ క్లబ్ కృషి

ఎర్రగడ్డ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బొగ్గును మండించి.. ఇస్త్రీపెట్టె వేడెక్కే వరకూ వేచి ఉండి, ఇస్త్రీ చేయాలంటే కార్మికులకు శ్రమతో పాటు, సమయం కూడా వృథా అవుతుంది. బొగ్గుతో వచ్చే పొగతో అనారోగ్యానికీ ఆస్కారం ఉంది. వీటికి చెక్ పెడుతూ ఎల్పీజీ ఇస్త్రీపెట్టెలు వాడుకలోకి వస్తున్నాయి. బొగ్గు ఇస్త్రీపెట్టెలో బొగ్గు మండించి వేడెక్కడానికి దాదాపు గంట నుంచి రెండు గంటల సమయం పడుతుంది. ఎల్పీజీలో కేవలం రెండు నిమిషాలకే ఐరన్ బాక్స్ వేడెక్కుతుంది. బొగ్గు ఖరీదు కన్నా ఎల్పీజీ ఖర్చే తక్కువ. దీంతో కార్మికుల ఆదాయం కూడా పెరుగుతుంది. బొగ్గు పొగ వల్ల కార్మికులకు కలిగే దుష్పరిణామాలూ ఉత్పన్నం కావు. బొగ్గుతో ఇస్త్రీ చేసే కార్మికులకు ఉపశమనంగా ఎల్పీజీ ఐరన్ బాక్స్‌లను పరిచయం చేయడానికి రోటరీ క్లబ్ కృషి చేస్తోంది. ఎల్పీజీ ఐరన్ బాక్స్‌తో గల లాభాలను కార్మికులను తెలియజేస్తోంది.



ఎల్పీజీ బాక్స్‌తో ఇస్త్రీ చేస్తున్న కార్మికుడు

ఎన్నో లాభాలు

బొగ్గుల ఇస్త్రీపెట్టె బరువు సుమారు 10.5 కేజీలు ఉంటుంది. కానీ ఎల్పీజీ బాక్స్ 6.5 కేజీలు మాత్రమే. అధిక బరువు ఉండే బొగ్గు ఇస్త్రీపెట్టె వల్ల కార్మికులు చేతి కండరాలు, కీళ్లనొప్పులతో బాధపడతారు. బొగ్గులపెట్టే కిలో బొగ్గుతో ఆరు గంటలు పనిచేస్తే, కిలో ఎల్పీజీతో ఈ ఐరన్ బాక్స్ మూడు రోజుల వరకు పని చేస్తుంది. రోజుకు 8 నుంచి 10 గంటల వరకు కరెంట్ ఐరన్‌బాక్స్‌తో ఇస్త్రీ చేస్తే నెలకు సుమారు రూ. 8,000 నుంచి 10,000 వరకు బిల్లు వస్తుంది. కరెంటు బాక్స్‌తో ఒక ప్యాంటు ఇస్త్రీకి మూడు రూపాయలు ఖర్చు రాగా, బొగ్గుల బాక్స్‌తో రూ.1.35 అవుతుంది. ఎల్పీజీతో కేవలం 55 పైసలు మాత్రమే ఖర్చవుతుందని నిపుణులు చెబుతున్నారు. బొగ్గుల ఇస్త్రీపెట్టెతో నెలకు రూ.2,500 ఖర్చు వస్తే, ఎల్పీజీకి కేవలం రూ. 800 మాత్రమే ఖర్చు అవుతుంది. దీంతో కార్మికుడికి సుమారు రూ.1,700 లాభం ఉంటుంది. ఒక్కసారి బొగ్గును మండిస్తే, పని ఉన్నా లేకపోయినా అది కాలిపోతూ ఇంధనం వృథా అవుతుంది. కానీ, గ్యాస్ స్టౌను ఆఫ్ చేసినట్లు ఎల్పీజీని కూడా ఆఫ్ చేసుకోవచ్చు. బొగ్గుల పెట్టె ద్వారా ఉత్పన్నమయ్యే కార్బన్ ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతింటాయి. ఎల్పీజీతో కార్బన్ చాలా తక్కువగా విడుదలవుతుంది. కాబట్టి అలాంటి సమస్యలు ఉండవు.

కేవలం రెండు నిమిషాల్లో వేడెక్కుతుంది



బొగ్గుతో ఇస్త్రీపెట్టె వేడెక్కాలంటే రెండు గంటలు వేచి ఉండే వాళ్లం. ఎల్పీజీ ఐరన్ బాక్స్ కేవలం రెండు నిమిషాల్లోనే వేడెక్కుతుంది. సమయం, డబ్బు ఆదా అవుతున్నాయి.

\- ధర్మ, పాండురంగ నగర్

ఎల్పీజీ బాక్స్‌లను వాడుకలోకి తేవడానికి కృషి



బొగ్గు ఇస్త్రీపెట్టెతో కష్టాలు పడుతున్న కార్మికులకు ఊరటగా ఎల్పీజీ ఐరన్ బాక్సులను వాడుకలోకి తేవడానికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే చాలామంది కార్మికులకు ఈ ఐరన్ బాక్స్‌లను అందజేశాం. మహిళా ఇస్త్రీ కార్మికులు 50 మంది కలిసి ముందుకు వస్తే వారికి సబ్సిడీ ద్వారా అందజేస్తాం. వివరాలకు 7729070809 నంబర్(రోటరీక్లబ్, హైదరాబాద్)ను సంప్రదించవచ్చు.

\- ఏ మోహన వంశీ, రోటరీ క్లబ్, జిల్లా అసిస్టెంట్ గవర్నర్